సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం ׀ 14 ׀ ఆగస్టు ׀ 2025



ఉచిత బస్సు కొందరికే!

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఈనెల 15 నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. - 8లో



తాళం వేసిన ఇళ్లే టార్గెట్

వివిధ చోరీలు, ఇంటి యజమానిపై దాడి చేసిన సంఘటనల్లో నిందితుడు తిమ్మారెడ్డి మహమ్మద్ రఫీని బుధవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసినట్లు ప్రొద్దుటూరు రూరల్ సీఐ తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
25.9 /24.0

వాతావరణం

జిల్లాలో బుధవారం 24.0 - 25.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

25 నుంచి ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి వివిధ కోర్సుల్లో నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీ పార్లర్ (35 రోజులు), జ్యూట్ ప్రోడెక్ట్ (14 రోజులు), కొవ్వొత్తుల తయారీ (11 రోజులు)లో శిక్షణ ఉంటుందని వివరించారు. 18–45 ఏళ్లలోపు కలిగిన నిరుద్యోగ మహిళలు ఇందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పిస్తామన్నారు. నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

డీఫార్మసీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ సైన్సు గ్రూపు(ఎంపీసీ/బైపీసీ) పాస్ అయిన విద్యార్థులు గవర్నమెంట్, ప్రైవేటు పాలిటెక్నిక్‌లో డిఫార్మసీ (డిప్లొమా ఇన్ ఫార్మసీ) రెండేళ్ల కోర్సులో చేరేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఈ నెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 6302782239, 9440144057 సంప్రదించాలని సూచించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన సుబ్బారెడ్డి



మాజీ సీఎం వైఎస్ జగన్‌ని కలిసిన ఒంటిమిట్ట జెడ్పీటీసీ అభ్యర్థి సుబ్బారెడ్డి తదితరులు

ఒంటిమిట్ట : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్టలో మంగళవారం జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నిక గురించి ఆయనతో చర్చించారు. ఇంతటి ఘోరమైన ఎన్నికలు తమ జీవితంలో చూడలేదన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన ప్రతి బూత్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ సమక్షంలో ఆయన మనుషులు రిగ్గింగ్ చేశారని తెలిపారు. ఇక్కడ జరిగిన దౌర్జన్యాలు, అక్రమాల గురించి మాజీ సీఎంకు వివరించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్‌టైమ్ సెటిల్మెంట్ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల

కడప ఎడ్యుకేషన్ : పూర్వ విద్యార్థులకు సంబంధించి వన్ టైమ్ సెటిల్మెంట్ సప్లిమెంటరీ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల చేశామని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ తెలిపారు. 2018, 2019, 2020, 2021,2022 సంవత్సరంలో తృతీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు వన్‌టైమ్ సెటిల్మెంట్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయన్నారు. ఇందులో ప్రతి ఒక్క పేపర్‌కు రూ. 1000 చెల్లించాలని తెలిపారు. పరీక్ష ఫీజును ఈనెల 14 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ ఫీజును చలానా ద్వారా చెల్లించాలని వివరించారు. విద్యార్థులకు ఏదైనా సందేహాలు ఉంటే ప్రభుత్వ పురుషుల కళాశాలోని పరీక్షల విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

నిత్యపూజ స్వామికి రూ. 1,38,003 ఆదాయం

సిద్దవటం : వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి హుండీ ఆదాయం లెక్కించారు. బుధవారం ఆలయ ఇన్‌చార్జి ఈఓ శ్రీధర్ మాట్లాడుతూ జూన్, జూలై నెలల్లో భక్తులు స్వామి వారి హుండీలో వేసిన కానుకలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించగా రూ. 1,38,003 వచ్చిందని తెలిపారు. రాజంపేట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ పాల్గొన్నారు.

'పింఛా'లో పెరిగిన నీటిమట్టం

సుండుపల్లె : గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పింఛా ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది.బుధవారం సాయంత్రానికి 258 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరగా ప్రస్తుతం 996.6 అడుగుల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులో మొత్తం నీరు 81.74 శాతంగా ఉందని జలవనరుల శాఖ ఏఈఈ నాగేంద్రనాయక్ తెలిపారు. ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదల కారణంగా ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని, ఏ సమయంలోనైనా గేట్లు ఎత్తుతారని, అందువల్ల ప్రాజెక్టుకు దిగువ ప్రాంతాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

ఓటుకూ వెన్నుపోటే!



అచ్చవెల్లి పోలింగ్ కేంద్రం వద్ద బయటకువచ్చిన టీడీపీ నేతలతో పోలీసుల మాటా మంతి



తమ ఓట్లు గల్లంతయ్యాయంటూ కనుమపల్లె ఎస్టీ కాలనీ ప్రజల నిరసన

సీఎంఓ డైరెక్షన్.. పచ్చ నేతల ఫుల్ యాక్షన్!

- పులివెందులలో గెలుపు కోసం అడ్డదారి
- వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండానే పోలింగ్
- హత్యాయత్నం ఘటనలతో ఉద్రిక్తతలు
- పోలింగ్ రోజు విజృంభించిన టీడీపీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, కడప : రాజ్యాంగానికి తూట్లు పొడవంలో.. ప్రజాస్వామ్యాన్ని చెరబట్టడంలో కూటమి నేతలు పూర్తిగా విజయం సాధించారు. బందూక్ రాజ్యంలో.. పచ్చ బందిపోట్లు రెచ్చిపోయారు. బూతుల్లో చొరబడి రిగ్గింగ్ చేయడంలో సక్సెస్ అయ్యారు. దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన 'ఓటుకూ' వెన్నుపోటు పొడిచి వెన్నుపోటుకు తాను బ్రాండ్ అంబాసిడర్‌నని సీఎం చంద్రబాబు మరోసారి రుజువు చేశారు.

నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుంది తెలుగుదేశం పార్టీ తీరు. అల్లరి మూకలతో అరాచకాలకు తెరలేపి.. ప్రజాస్వామ్యాన్ని పట్ట పగలే ఖూనీ చేశారు. వ్యవస్థలన్నిటినీ చెరబట్టి సీఎం చంద్రబాబు ఆయన శిష్య బృందం వికృతానందం పొందారు. ప్రజా బలం లేని పులివెందులలో గెలవడానికి తాపత్రయం పడ్డారు. ఒక చిన్న జెడ్పీటీసీ ఎన్నికలో రిగ్గింగ్ చేసుకుని విజయం సాధించాం అని చెప్పుకునేందుకు చేయని అకృత్యాలు లేవు.

పులివెందుల...ఈ పేరు చెబితేనే పచ్చ పార్టీకి ముచ్చెమటలు పడతాయి. అందులోనూ వైఎస్ అనే రెండక్షరాలను వింటే వారి ఒంట్లో వణుకు పుడుతుంది. ఆ వణుకును కప్పి పుచ్చుకునేందుకు స్థానికంగా ఉన్న కూటమి నేతలు ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ డైరెక్షన్‌లో పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో సక్సెస్‌ఫుల్ యాక్షన్ పూర్తి చేశారు.

రాష్ట్రంలో ఎన్నో జెడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నా, పులివెందుల, ఒంటిమిట్ట మాత్రమే ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పించారు. ప్రజాబలం లేక అధికార బలంతో దాష్టీకాలకు దిగి 'పులివెందులలో మేమూ ఓసారి గెలిచాం' అని చెప్పుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. వైఎస్ అనే పేరును ప్రజల మనసుల్లోంచి చెరిపేయాలని వారు చేయని ఆకృత్యమంటూ లేదు. అయినా ప్రజలు వైఎస్ అనే పేరు వెనుకే ఉండటంతో చేసేదేమీ లేక రక్తపాతానికి దిగి రణరంగాన్ని సృష్టించారు. సైదాపురం సురేష్‌రెడ్డి(వంటి), అమరేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిలపై వరుసగా హత్యాయత్నం ఘటలకు పాల్పడ్డారు. నామినేషన్ల రోజు నుంచీ ఆ పార్టీ నేతలు చేసిన అగడాలు, పోలింగ్ రోజుకు మరీ మితిమీరిపోయాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న ఓటు హక్కును సైతం కాలరాశారు. చివరికి ప్రజలకు అండగా నిలవాల్సిన పోలీసుశాఖ టీడీపీ నేతల అడుగులకు మడుగులొత్తితే..ఎన్నికల కమిషన్ కళ్లుండీ చూడలేని గాంధారీ పాత్రను పోషించింది.

▶▶ భయోత్పాతం సృష్టించిన హత్యాయత్నం ఘటనలు

వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి నేతలు దాడులకు తెగబడ్డారు. వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం ఘటన సంచలనంగా మారింది. ఒక్కమారుగా భయోత్పాతం సృష్టించారు. పైగా పోలీసులు ద్వారా కనిపించిన వారిని కనిపించినట్లు కేసులు పెట్టి జైళ్లకు పంపడం తొలి ఎత్తైతే...పోలింగ్ నాడు బూత్‌లను ఆక్రమించుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇంఛార్జులు అంతా కలిసి ప్రజాస్వామ్యాన్నే చెరబట్టారు. ఎన్నికల కమిషన్ అందుకు వత్తాసు పలికింది. ప్రజల్ని పోలింగ్ బూత్‌లోకి కూడా రానివ్వకుండానే జమ్మలమడుగు, కమలాపురంతో పాటు జిల్లాలోని టీడీపీ క్యాడర్ అంతా బాహాటంగా దొంగ ఓట్లు వేసుకున్నారు. చివరికి తన సమక్షంలోనే దొంగ ఓట్లు వేస్తున్నా కలెక్టర్ ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. ఇది ప్రజాస్వామ్యం కాదు, మళ్లీ బైపోల్ నిర్వహించండని వైఎస్సార్‌సీపీ కోరితే, తూచ్ అలాంటిదేమీ కుదరదంటూ ఎన్నికల కమిషన్ చేతులెత్తేసింది. మరీ ఇంత దారుణంగా అరాచకాలు చేస్తారా అని రేపు కోర్టులు ప్రశ్నిస్తాయేమోనని భయపడి పథకం ప్రకారం బుధవారం రెండు పోలింగ్ బూత్‌లలో నామ్‌కేవాస్తే రీపోలింగ్ నిర్వహించారు. దాన్ని వైఎస్సార్‌సీపీ బహిష్కరించింది. ఎట్టి పరిస్థితుల్లో వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరా ఫుటేజ్ బయటపెట్టి, దొంగ ఓట్లు వేసినవారందరినీ గుర్తించి ఎన్నిక రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది.

వ్యవస్థలను వాడుకోవడంలో వారి తర్వాతే...

వ్యవస్థలను ఎలా వాడుకోవాలో సీఎం చంద్రబాబుకు తెలిసినంతగా ఎవరికీ తెలియదని మరో మారు నిరూపించారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరిగితే ఎట్టి పరిస్థితుల్లో విజయం సాధించలేమని తెలుసు. కాబట్టే ప్రజల హక్కులనే కాలరాశారు. అల్లరి మూకలతో పల్లెలను రణరంగంగా మార్చేశారు. కళ్ల ముందే ఇంత జరుగుతున్నా అడ్డుకోవాల్సిన వ్యవస్థలు అధికార పార్టీకి జీ హుజూర్...అంటూ మోకరిల్లాయి. టీడీపీ ఆకృత్యాలపై తప్పకుండా న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని వైఎస్సార్‌సీపీ స్పష్టం చేస్తోంది. కాగా, సీఎంఓ డైరెక్షన్‌ను క్షేత్రస్థాయిలో కూటమి నేతలు, వ్యవస్థలు సక్సెస్ ఫుల్‌గా యాక్షన్ చేశాయని నిపుణులు వివరిస్తున్నారు.

ఫ్రీ పోలింగ్ జరపాలి



పులివెందుల మండల జెడ్పీటీసీ ఎన్నికలు ఫ్రీ పోల్ గా జరపాలి. టీడీపీ గుండాలు పోలింగ్ బూతుల వద్ద కాపు కాయడం సరికాదు. గ్రామస్తుల ఓటర్ స్లిప్పులను చింపి వాళ్లే ఓటు వేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఇలాంటి సంస్కృతి మానేస్తే బాగుంటుంది. అంతేకాకుండా అధికారులు మా గ్రామం నుంచి వేరే గ్రామానికి పోలింగ్ బూతులను మార్చడం సరైన పద్ధతి కాదు. మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది.
– చందన, ఇ -కొత్తపల్లె (దళితవాడ) పులివెందుల

ఇలాంటి ఎన్నికలు ఎప్పుడు జరగలేదు



ఇలాంటి ఎన్నికలు ఎప్పుడు జరగలేదు. అందుకే మా కొత్తపల్లి దళితవాడలోని ఓటర్లందరం బాయ్ కాట్ చేస్తున్నాం. ఉదయం 6 గంటల నుంచి టీడీపీ గుండాలు బూతుల వద్దకు చేరుకున్నారు. బూతు దగ్గరికి వెళ్లగానే మా దగ్గర ఉన్న స్లిప్పులు లాక్కుంటున్నారు. మీరు వెళ్లిపోండి మీ ఓటు మేమే వేస్తాం అని అంటున్నారు. మా ఓటును కూడా మేము వేసుకునే పరిస్థితిలో లేం. ఇలాంటి సంస్కృతి కూటమి నేతలు మార్చుకోవాలి.
– గోవిందమ్మ, ఇ -కొత్తపల్లె, పులివెందుల

ఓటింగ్ బాయ్ కాట్



పులివెందుల మండలంలోని ఇ-కొత్తపల్లె దళితవాడ గ్రామస్తులందరం పోలింగ్‌కు వెళ్లకుండా బాయ్ కాట్ చేశాం. నేను పోలింగ్ బూత్ లో ఏజెంటుగా ఉన్నాను. కానీ పోలింగ్ బూత్ వద్ద ఇతర ప్రాంతాల నుంచి టీడీపీ గుండాలు చుట్టూ ముట్టారు. నా దగ్గర ఉన్న ఏజెంట్ ఫారాన్ని లాక్కొని చింపి వేశారు. ఓటర్లు, ఏజెంట్లు వెళ్లలేని పరిస్థితి ఉన్నప్పుడు ఎన్నికలు ఎందుకు జరపాలి. మా ఓటును స్వేచ్ఛగా అధికారులు వేసుకోలేనప్పుడు ఎన్నికలను రద్దు చేయాలి.
– వరలక్ష్మి, మండలాధ్యక్షురాలు, ఇ -కొత్తపల్లె.

అంతా పథకం ప్రకారమే!

పోలింగ్ బూత్‌లోకి మంత్రి వెళుతున్నా అడ్డుకోలేకపోయిన అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అనుకున్న ప్రకారమే అంతా అయింది.. ముందస్తు ప్రణాళిక వేసుకుని అంతా పథకం ప్రకారమే పూర్తి చేశారు. టీడీపీ యథేచ్ఛగా బూతుల్లో చొరబడుతున్నా పోలీసు యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుందే తప్ప ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు ఒక రూలు...అధికార పార్టీ నేతలకు మరో రూలు అన్నట్లు నడించింది. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి బూతుల్లోకి వెళ్లి వైఎస్సార్ సీపీ ఏజెంట్లను విచక్షణా రహితంగా కొడుతున్నా అడ్డుచెప్పిన అధికారి లేరంటే నమ్మి తీరాల్సిందే. ముందస్తు వ్యూహం ప్రకారమే రెండు, మూడు గంటలు సాధారణ పోలింగ్‌కు అవకాశం ఇచ్చి...తర్వాత అంతా టీడీపీ గుండాలు బూతులను ఆక్రమించుకుని సైక్లింగ్‌కు తెర తీశారు. ఎప్పుడూ చూడని వారు...ఎన్నడూ కనిపించని వారు వచ్చి ఓట్లు వేస్తుంటే గ్రామస్తులు బూతు పురాణం అందుకున్నా, కనీసం చలనం లేకుండా టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేసుకున్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రంలో కొత్త సంప్రదాయం

జిల్లాలోని ఒంటిమిట్ట క్షేత్రం ఆధ్యాత్మికంగా అలరారుతోంది. టీటీడీ ఆధ్వర్యంలో నిత్యం పూజా కార్యక్రమాలతో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు జరుగుతున్న చోట అలజడి కొనసాగింది. ఎప్పుడూ చూడని...దాడులు, దౌర్జన్యాలతో మంత్రితోపాటు అనుచరగణం మండలమంతా తిరుగుతూ బూతులను ఆక్రమించుకుని రిగ్గింగ్ చేస్తూ కొత్త సంప్రదాయానికి తెర తీశారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై మంత్రి సమక్షంలోనే దాడులు చేసి బయటికి పంపడం, లోపల తమ కార్యకలాపాలు కొనసాగించడం కనిపించింది. అక్కడికి మంటపంపల్లె, సాలాబాద్, చిన్నకొత్తపల్లెల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలు ఎదురుపడిన సందర్భంలో ఇది పద్ధతి కాదు...మంత్రి గారూ అంటూ తెలియజేశారు. అయినా ముందుకు వెళుతూ ఎక్కడికక్కడ బూతుల్లో తమ పని తాము చేసుకుపోయారు.

రీపోలింగ్ జరపాలి... జిల్లాలోని ఒంటిమిట్ట జెడ్పీటీసీ పరిధిలో అక్రమాలు జరిగాయని.... అన్ని చోట్ల రీపోలింగ్ నిర్వహించాలని వైఎస్సార్ సీపీ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు పార్టీ అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల అధ్యక్షులు అమరనాథరెడ్డి, పి.రవీంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ఓట్ల అక్రమాలతో పాటు గ్రామాల్లో ఓ టర్లను వేయనీయకుండా చేయడం, బూతుల్లో దౌర్జన్యాలు, రిగ్గింగ్ తదితర వాటిని పరిగణలోకి తీసుకుని రీ పోలింగ్ నిర్వహించడంతో పాటు గురువారం జరిగే కౌంటింగ్‌ను వాయిదా వేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

– కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్ : పటిష్టమైన భద్రతా బలగాల మధ్య కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి బుధవారం సాయంత్రం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జేసీ అదితి సింగ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన బ్యాలెట్ బాక్సులను అత్యంత సురక్షితంగా భద్రపరచామన్నారు. రౌండ్ల వారీగా కౌంటింగ్ సమాచారం కోసం మీడియా సెంటర్‌ను కుడా ఏర్పాటు చేశామన్నారు.

– పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 30 మంది సూపర్‌వైజర్లు 60 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, ముగ్గురు అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులకు కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు.

విద్యా విషయాలపై అవగాహన పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా సంబంధిత విషయాలపై ప్రధానోపాధ్యాయులతోపాటు మండల విద్యాశాఖ అధికారులు సంపూర్ణ అవగాహన పొందాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో హెచ్‌ఎం, ఎంఈఓలకు ఒక్క రోజు వర్కుషాపు జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ షేక్ షంషుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు జరగాలన్నారు. వీటితోపాటు విద్యా సంబంధిత విషయాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో జరుగుతున్న వర్కుషాపులో హెచ్‌ఎంలతోపాటు ఎంఈఓలు విద్యాభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించాలన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ నిత్యానందరాజు మాట్లాడుతూ హెచ్‌ఎంలతోపాటు ఎంఈఓలు విద్యాపరంగా విలువైన సలహాలు ఇస్తే రాష్ట్రస్థాయి అధికారులకు పంపిస్తామన్నారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖలో చాలా మార్పులు వచ్చాయని వాటికి అనుగుణంగా హెచ్‌ఎంలు, ఎంఈఓలు పనిచేయాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రమాదేవి, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటి డైరెక్టర్ సరస్వతి, జిల్లా వైద్యశాఖ ప్రతినిధి వెంకట చంద్రరెడ్డి, సమగ్రశిక్ష ప్లానింగ్ కో ఆర్డినేటర్ లక్ష్మి నరసింహారాజు, ఏఎంఓ వీరేంద్ర, జిసిడిఓ రూతు ఆరోగ్యమేరీ, ఏఎస్‌ఓ సంజీవ రెడ్డి, ఏపీఓ మాధవి, విజయభాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

ఇన్‌స్పైర్ మనాక్ పోస్టర్ ఆవిష్కరణ

ఇన్‌స్పైర్‌మనాక్ నామినేషన్ల స్వీకరణలో రాష్ట్రంలో వైఎస్సార్‌జిల్లాను మొదటిస్థానంలో నిలబెట్టాలని ప్రధానోపాధ్యాయులకు, ఎంఈఓలకు డీఈఓ షేక్ షంషుద్దీన్ పిలుపునిచ్చారు. బుధవారం కడప కలెక్టరేట్ సభాభవన్‌లో ఇన్‌స్పైర్ మనాక్ పోస్టర్‌ను డిప్యూటి ఈఓలు రాజగోపాల్‌రెడ్డి, మీనాక్షి, జిల్లా సైన్సు ఆఫీసర్ ఎబినైజర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనాక్‌కు ప్రతి పాఠశాల నుంచి 5 నామినేషన్లు చేయించేలా హెచ్‌ఎం, ఎంఈఓలు చొరవ తీసుకోవాలన్నారు. ఇన్‌స్పైర్ మనాక్‌కు సంబంధించిన ప్రాజెక్టులు ఇన్నోవేటివ్‌గా ఉండేలా చూడాలని సూచించారు. జిల్లా సైన్సు అధికారి ఎబినేజర్ మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం 5నుంచి శంకరాపురంలోని అంధుల పాఠశాలలో అందుబాటులో ఉంటానని... సందేహాలు ఉంటే తెలపాలని కోరారు. అప్లికేషన్ కోడ్‌ను 8328375357 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపితే స్కూల్ మెయిల్, పాస్‌వర్డు మార్చడం చేస్తామని తెలిపారు.

జిల్లాలో జడివాన



సాగులో ఉన్న అరటిపంట

కడప అగ్రికల్చర్ : జిల్లాలో వారం రోజుల నుంచి వర్షాలు జడిపట్టి కురుస్తున్నాయి. అల్పపీడనం కారణంగా మబ్బులు.. వాన చినుకులతోనే రోజులు గడుస్తున్నాయి. ఇక బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా చినుకులు రాలుతూనే ఉన్నాయి. దీంతో పనులపై బయటకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే విద్యార్థులు, ఉద్యోగ విధులకు వెళ్లే వారు సైతం అవస్థలు పడ్డారు. వరుస వానలతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లన్నీ బురదమయంగా మారి జనాలు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి జిల్లాలో వర్షం కురవలేదు. దీంతో చాలా మేర పంటలసాగు కాలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండున్నర నెల కావస్తున్నా నేటికి జిల్లాలో 20 శాతం మేరనే పంటలు సాగయ్యాయి. సాగైన పంటలకు సరైన వర్షాలు లేక రైతన్నలు కాసింత ఇబ్బందులకు గురయ్యారు. అల్పపీడనం కారణంగా జిల్లాలో వారం రోజుల నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో సాగులో ఉన్న ఆరుతడి పంటలైన జొన్న, సజ్జ, మొక్కజొన్న, కొర్ర, కంది, పెసర, మినుము, వేరుశనగ, సన్‌ఫ్లవర్, సోయాబీన్, పత్తి పంటలకు జీవం వచ్చింది. వరి పంటలకు ఉన్న తెగులు తగ్గి ఏపుగా వస్తున్నట్లు పలువురు రైతులు తెలిపారు.

ప్రారంభంకానున్న ఆరుతడి పంటలసాగు...

గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భూమి పదునెక్కింది. ఇక రైతన్నలు కాడీ, మేడీ సిద్ధం చేసుకుని సాగుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో వేరుశనగతోపాటు పసుపు, జొన్న, కందితోపాటు ఇంకా పలు రకాల ఆరుతడి పంటలను సాగు చేయనున్నారు. దీంతోపాటు కేసీ కాలువకు నీరు కూడా రావడంతో వరిసాగు పనులు కూడా ఊపందుకున్నాయి.

ఉద్యాన పంటలకు మేలే...


జిల్లాలోని పులివెందుల, చక్రాయపేట, వేముల, వేంపల్లి, వీన్‌పల్లిలతోపాటు పలు మండలాల్లో సాగులో ఉన్న ఉద్యాన పంటలైన మామిడి, చీని, సపోట, జామ వంటి ఉద్యాన పంటలకు ఈ వర్షంతో ప్రాణం వచ్చింది.

మండలం నమోదైన వర్షం (మి.మీ లలో)

ఖాజీపేట	29	ప్రొద్దుటూరు	6.4
చాపాడు	21	కడప	6.2
మైదుకూరు	19.6	సీకేదిన్నె	5.4
సిద్దవటం	13.8	కమలాపురం	5.2
చెన్నూరు	13.6	బి.మఠం	5.2
అట్లూరు	12.8	వేంపల్లి	4.0
ఒంటిమిట్ట	10.6	చక్రాయపేట	3.8
రాజుపాలెం	10.2	తొండూరు	3.6
పులివెందుల	9.0	కలసపాడు	3.2
లింగాల	8.8	వీఎన్‌పల్లి	2.4
వేముల	8.0	వల్లూరు	2.4
దువ్వూరు	7.8	బద్వేల్	2.2
సింహాద్రిపురం	7.8	పోరుమామిళ్ల	1.2
కొండాపురం	6.8	గోపవరం	0.8

'గండికోట'లోకి భారీగా కృష్ణా జలాల రాక

కొండాపురం : అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరు-నగరి సృజల స్రవంతి కెనాల్ ద్వారా 11,200 క్యూసెక్కుల కృష్ణజలాలు గండికోట జలాశయంలోకి వస్తున్నట్లు జీఎన్‌ఎస్‌ఎస్ ఈఈ ఉమా మహేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయం పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 20.1 టీఎంసీలకు చేరినట్లు ఆయన తెలిపారు. వాగులు వంకల ద్వారా 2700 క్యూసెక్కులనీరు జలాశయంలోకి వస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫుల్ రిజర్వాయర్ లెవల్ 695.5 అడుగులు ఉండగా ప్రస్తుతం 690 అడుగులకు రిజర్వాయర్ లెవల్‌కు చేరినట్లు తెలిపారు. గండికోట స్పిల్ వే క్రస్ట్ గేట్ల ద్వారా మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీరు వెళ్తున్నాయన్నారు. గండికోటఎత్తిపోతల పథకం ద్వారా నాలుగు మోటర్లతో 440 క్యూసెక్కులనీరు పంపింగ్ చేస్తున్నామని వెల్లడించారు. జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కుల నీరు తరలిస్తున్నామన్నారు.



గండికోట జలాశయం

వర్షానికి కూలిన పై కప్పు

కొండాపురం : నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని బి.కొట్టాలపల్లె గ్రామానికి చెందిన ఆర్. హరికేశవరెడ్డి మట్టి మిద్దె ఇంటి కప్పు మంగ్లవారం రాత్రి కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం లేదా నూతన ఇళ్లు మంజూరు చేయాలని బాధితుడు కోరారు.

అధికారుల పరిశీలన

మైలవరం : మండల కేంద్రంలోని అయ్యవారిపల్లె గ్రామంలో వర్షానికి మిద్దె పైకప్పులు కూలిపోయాయి. బుధవారం ఉదయం తహసీల్దార్ లక్ష్మీనారాయణ సంఘటన స్థలాన్ని చేరుకుని మిద్దెను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు గంగబోయిన రవికుమార్, చౌడం వెంగళరావు తమ ఆవేదనను అధికారులకు విన్నవించారు. అనంతరం తహసీల్దార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



బి. కొట్టాలపలెలో వర్షానికి కులిన ఇంటి పై కప్పు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


వెంకటేష్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం ఆటో నగర్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ (29) అనే వ్యక్తి మృతి చెందాడు. కడప ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సిద్దవటం మండలం ఎగువపేటకు చెందిన వెంకటేశ్ కడపలో ప్రైవేటు దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతున్న సమయంలో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాలుగు ఇసుక టిప్పర్లు పట్టివేత

చాపాడు : తిప్పిరెడ్డిపల్లె సమీపంలోని పెన్నానదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పట్టుకున్నట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు. ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆదేశాల మేరకు పెన్నానదిలో దాడులు నిర్వహించగా నాలుగు టిప్పర్లు ఇసుకను తరలిస్తుండగా వాటిని పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి తహసీల్దారు రమాకుమారికి అప్పగించినట్లు చెప్పారు.

పెట్రోల్‌తో పాటు నీళ్లు

ద్విచక్ర వాహనదారుల ఆందోళన


పెట్రోలుతోపాటు నీరు వచ్చిన పెట్రోలును చూపిస్తున్న ద్విచక్రవాహనదారుడు

వేంపల్లె : స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న హెచ్‌పీ పెట్రోలు బంకులో పెట్రోలుతోపాటు నీరు వస్తుండటంతో ద్విచక్ర వాహన దారులు ఆందోళన చెందుతున్నారు. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పులివెందుల రోడ్డులోని హెచ్‌పీ పెట్రోలు బంకులో వర్షపు నీరు వెళుతున్నట్లు తెలిసింది. బుధవారం వేంపల్లెకు చెందిన ఇబ్రహీం అనే వ్యక్తి ఈ పెట్రోలు బంకులో తన మోటార్ బైకుకు రూ.500లకు పెట్రోలు పట్టుకోవడంతో పెట్రోలుతోపాటు నీరు కూడా వచ్చింది. మోటార్ బైకు కొద్ది దూరం పోయిన తర్వాత ఆగిపోవడంతో మోటార్ బైకును బజాజ్ షోరూంకు తీసుకొని వెళ్లాడు. మెకానిక్ పరిశీలించి ట్యాంకరులో పెట్రోలుతోపాటు నీరు కూడా ఉందన్నారు. అయితే పెట్రోలు బంకు యాజమాని వద్దకు వెళ్లి విషయాన్ని తెలిపినా ఆయన సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పెట్రోలు బంకు యాజమాన్యంపై చర్యలు తీసుకుని వాహన దారులను కాపాడాలని కోరారు.

ఉచిత బస్సు కొందరికే!

- ఉద్యోగులు, విద్యార్థులకు తిప్పలు
- పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో మాత్రమే అవకాశం
- నాన్‌స్టాప్‌లో ఉచిత ప్రయాణానికి నో
- మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అందని ద్రాక్ష



కడపకోటిరెడ్డిసర్కిల్ : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఈనెల 15 నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించనున్న పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఉచిత ప్రయాణం కొందరికే ఉపయోగపడనుంది. ఒకవైపు ఎక్స్‌ప్రెస్‌లలో ఉచితం అంటూనే నాన్ స్టాప్‌లుగా నడిచే ఎక్స్‌ప్రెస్‌లలో నో ఫ్రీ అంటూ కొర్రీలు పెట్టింది. ప్రస్తుతానికి నిబంధనలు ఇవే ఉన్నప్పటికీ ప్రారంభించే సమయానికి ఇంకా ఎన్ని నిబంధనలు ఉంటాయోనని ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అయితే ఇంతవరకు ఆర్టీసీ అధికారులకు మార్గదర్శకాలు రాకపోవడం విశేషం.

జిల్లాలో కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల్లో ఎక్స్‌ప్రెస్‌లు 113, పల్లె వెలుగు 189, అల్ట్రా పల్లె వెలుగు 58 బస్సులు ఉన్నాయి. ఇంతవరకు కొత్త బస్సు ఒక్కటి కూడా రాకపోవడం దారుణం. మరోవైపు ఎక్స్‌ప్రెస్ సర్వీసులైన నాన్‌స్టాప్ బస్సుల్లో అనుమతులు లేకపోవడం వల్ల పెద్దగా ఒరిగేదేమీ లేదని చర్చించుకుంటున్నారు. పట్టణాల నుంచి పల్లెలకు నడిచేవి పల్లె వెలుగు బస్సులు మాత్రమే. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ఉచిత ప్రయాణం అందరికీ ఉపయోగపడే పరిస్థితి లేదని అంటున్నారు.

డొక్కు బస్సుల్లోనే ప్రయాణం

ప్రతిరోజు జిల్లాలో వివిధ బస్సుల్లో 1.50 లక్షల నుంచి 1.70 లక్షల వరకు ప్రయాణికులు వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వాటిలో మహిళలు 60–70 వేల మంది వరకు ప్రయాణిస్తుంటారు. జిల్లాలో 360 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించారు. కండీషన్‌లో లేని బస్సులు కడప రీజియన్‌లో అధికంగా ఉండడం గమనార్హం. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసిన తర్వాత ఎక్కువ మంది మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అయితే బస్సుల్లో లోడు పెరగడం ద్వారా బస్సుల పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో ప్రయాణం సజావుగా సాగుతుందా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మూలన పడేందుకు సిద్ధంగా ఉన్న బస్సులకు రంగులు అద్ది రోడ్లపైకి తీసుకు వచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఉద్యోగులు, విద్యార్థులకు తప్పని తిప్పలు

ప్రతిరోజు ఉదయాన్నే విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, మరోవైపు ఉద్యోగులు తమ కార్యాలయాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. అయితే మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో ఒక్కసారిగా మహిళలు అధికంగా బస్సులో ఎక్కితే ఉదయం, సాయంత్రం సమయాల్లో విద్యార్థులు, ఉద్యోగులకు సీట్లు దొరికే పరిస్థితి ఉండదు. దీంతో అధికారులు ఈ సమస్యను అధిగమించేందుకు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

ఇచ్చిన హామీ విస్మరించారు

గత సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గద్దె ఎక్కాలన్న తలంపుతో రాష్ట్రమంతటా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని కూటమి నేతలు హామీలు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని మడత పెట్టారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఈ బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణమని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఎక్కడా కూడా చెప్పలేదు. అధికారం చేపట్టిన ఏడాది తర్వాత ఈ పథకాన్ని అమలు చేస్తూ చంద్రబాబు తన కుతంత్రాన్ని బహిర్గతం చేశారని మహిళలు మండిపడుతున్నారు.

నాన్ స్టాపుల్లో నో ఎంట్రీ

జిల్లాలో కడప–తిరుపతి, కడప–ప్రొద్దుటూరు, ప్రొద్దుటూరు–జమ్మలమడుగు ప్రాంతాలకు నాన్ స్టాప్ బస్సులను నడుపుతున్నారు. అయితే ఆర్టీసీలో ఎక్కువగా ఎక్స్‌ప్రెస్ బస్సులనే నాన్‌స్టాప్ సర్వీసులుగా నడుపుతున్నారు. వీటిల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించరు

టిక్కెట్ జారీ ఇలా..

స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత ప్రయాణానికి టిక్కెట్‌జారీ విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. బస్సు ఎక్కేచోటు నుంచి దిగే ప్రాంతం వరకు టిక్కెట్ ఇస్తారు. టిక్కెట్ విలువను సున్నాగా నమోదు చేస్తారు. టిక్కెట్ జారీ చేసే టిమ్ మిషన్‌లో ప్రత్యేకంగా ఉమెన్ ఫ్రీ టిక్కెట్ పేరిట బటన్ ఏర్పాటు చేశారు. బాలికలు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్స్‌కు జీరో ఫెయిర్ టిక్కెట్ ఇస్తారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఉచిత ప్రయాణానికి కండక్టర్‌కు గుర్తింపుకార్డు తప్పనిసరిగా చూపాలి. ఆధార్, ఓటరు ఐడీ, రేషన్‌కార్డు, పాస్‌పోర్టులలో ఏదో ఒకటి చూపడం తప్పనిసరి. ఆయా గుర్తింపు కార్డులో మన రాష్ట్రంలోని ఏదో ఒక ప్రాంతంలో నివసిస్తున్నట్లుగా ఉండాల్సి ఉంటుంది.

బస్సులను కండీషన్‌లో ఉంచాం



రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి అమలు చేయనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అన్ని బస్సులను కండీషన్‌లో ఉండేలా చూస్తున్నాం. ఇదే సమయంలో సాధారణ ప్రయాణికులకు కూడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాం.

– పొలిమేర గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కోసం పెద్దదర్గాలో ప్రార్థనలు


పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐలు, నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులు బుధవారం పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత వారు దర్గాలోని ప్రధాన గురువులు హజరత్ పీరుల్లాసాహెబ్ మాలిక్ మజార్‌ను దర్శించుకుని ఫాతెహా చేశారు. అనంతరం దర్గాలోని ఇతర గురువుల మజార్లను కూడా దర్శించుకుని ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ మాట్లాడుతూ మృదు స్వభావి, ప్రజా నాయకుడు, సామాన్య కార్యకర్తను కూడా ఎంతో అభిమానంతో పలకరించే మిథున్‌రెడ్డిని రాజకీయ కక్షతోనే అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఎన్‌ఆర్‌ఐలతోపాటు వారి కుటుంబ సభ్యులకు తమవంతుగా తోడ్పాటు అందించిన పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి బెయిలుపై విడుదల కావాలని దర్గా గురువులను ప్రార్థించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ సభ్యులు షేక్ గఫార్, ఎన్.సుబ్బారెడ్డి, సి.అమర్నాథ్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి అలీ అక్బర్, ప్రధాన అధికార ప్రతినిధి షేక్ గౌస్ బాషా (చాక్లెట్) కార్పొరేటర్లు షేక్ షంషీర్, షేక్ జిలాన్ (డిష్ జిలాన్), జి.ప్రవీణ్, కుమార్‌రెడ్డి, షేక్ గయాజ్, బాబుభాయి, నాసర్, రాజాసాబ్, పీర్‌బాషా, ఫారూఖ్, అహ్మద్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

ధర్నాలో ఎన్ఎంయూఏ నాయకులు


ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ప్రభుత్వం, యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రెండవ రోజు బుధవారం అసోసియేషన్ నాయకులు కడప ఆర్టీసీ బస్టాండులోని ప్రధాన ద్వారం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించి తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, వేతన సవరణ జరిగి ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తయినందున వెంటనే ఐఆర్ ప్రకటించాలని, గవర్నర్‌పేట–2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులూ సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. 8 వేల ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని, గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులు వెంటనే ఇవ్వాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించడంతోపాటు మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రీజినల్ ప్రెసిడెంట్ నాగముని, డిపో ప్రెసిడెంట్ జయరాం, గ్యారేజ్ సెక్రటరీ మల్లేష్, డిపో జాయింట్ సెక్రటరీ లక్ష్మయ్య, సీఎస్ రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- పట్టపగలే చోరీ, దాడి కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలను వెల్లడించిన ప్రొద్దుటూరు రూరల్ సీఐ


వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సీఐ బాల మద్దిలేటి, చిత్రంలో ఎస్ఐ వెంకటరమణ


రికవరీ చేసిన బంగారు ఆభరణాలు

రాజుపాళెం : వివిధ చోరీలు, ఇంటి యజమానిపై దాడి చేసిన సంఘటనల్లో నిందితుడు తిమ్మారెడ్డి మహమ్మద్ రఫీని బుధవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసినట్లు ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి తెలిపారు. ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం రూరల్ సీఐ, రాజుపాళెం ఎస్ఐ వెంకటరమణతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నిందితుడు మహమ్మద్ రఫీ గతంలో కర్నూలు, వెలుగోడు, గోనెగండ్ల, ఓర్వకల్లు, ఉలింది కొండ, చాగలమర్రి, ఆళ్లగడ్డ తదితర పోలీస్ స్టేషన్‌లో పలు చోరీ కేసులలో నిందితుడుగా ఉన్నాడన్నారు. పట్ట పగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడేవాడన్నారు.

పట్టపగలే చోరీ..

ఈ నెల 7వ తేదీన రాజుపాళెం మండలంలోని టంగుటూరు గ్రామంలో నంద్యాల వెంకటసుబ్బయ్య ఇంటికి తాళం వేసి ఉండడాన్ని చూసి సదరు నిందితుడు మహమ్మద్ రఫీ ఇంటి తాళం, బీరువాను పగల గొట్టేందుకు ప్రయత్నించాడని తెలిపారు. అంతలో ఇంటి యజమాని నంద్యాల వెంకటసుబ్బయ్య ఇంటిలోనికి రాగా బీరువాను పగులగొడుతున్న నిందితుడిని ఎవరు నువ్వు అని ప్రశ్నించగా దొంగతనానికి వచ్చానని చెప్పి ఇంటి యజమానిపై దాడి చేశాడన్నారు. చోరీకి ఉపయోగించిన ఇనుప రాడ్డు తీసుకొని వెంకటసుబ్బయ్య తలపై కొట్టడంతో రక్త గాయాలయ్యాయన్నారు. ఆ సమయంలో యజమాని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా ఇంట్లోకి రావడంతో చోరీ చేస్తున్న రఫీ పారిపోయాడని సీఐ తెలిపారు. నంద్యాల వెంకటసుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజుపాళెం పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై చోరీతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని గోపాయపల్లె చెక్‌పోస్ట్ వద్ద అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. టంగుటూరు, రాజుపాళెం గ్రామాల్లో చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుడి వద్ద నుంచి రికవరీ చేసినట్లు చెప్పారు. నిందితుడు మహమ్మద్ రఫీ దువ్వూరు మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన వాడు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు సీఐ వివరించారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

ప్రజలు చోరీలపై అప్రమత్తంగా ఉండాలని, ఇంట్లో విలువైన వస్తువులు, నగదును భద్రపరుచు కోవడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ చంద్రానాయక్, పోలీసులు సుధాకర్, కిరణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ మెకానిక్ మృతి

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని చౌడూరు దేవగుడి బైపాస్ రోడ్డులో బుధవారం వేకువ జామున షేక్ నజీర్ (50) అనే లారీ మెకానిక్ మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. లారీ మెకానిక్ నజీర్ ప్రొద్దుటూరులోని మట్టిమసీదు వీధిలో నివాసం ఉంటున్నాడు. మరో మెకానిక్ సందానిబాషాతో కలిసి మంగళవారం సాయంత్రం కొలిమిగుండ్ల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వద్దకు బైక్‌లో వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని ఇద్దరు రాత్రి ప్రొద్దుటూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో బుధవారం వేకువ జామున 1 గంట సమయంలో చౌడూరు సమీపంలోని దేవగుడి బైపాస్ రోడ్డు వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం వారి బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నజీర్ కొద్ది సేపటి తర్వాత మృతి చెందాడు. సందానిబాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు.

భవన నిర్మాణాలకు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు

రాయచోటి టౌన్ : భవన నిర్మాణాల కోసం ఆన్‌లైన్ ద్వారానే అనుమతులు పొందాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. బుధవారం ఎల్‌ఆర్‌ఎస్, బిల్డింగ్ రూల్స్‌పై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు,కుప్పం, మదనపల్లె పట్టణాలలో భవన నిర్మాణాల కోసం ఆన్‌లైన్ ద్వారా అనుమతులు తీసుకున్న వారు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. మాన్యువల్‌గా ఇవ్వరాదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అనధికార లే అవుట్‌లను క్రమబద్ధీకరించుకొనేందుకు 134 జీఓను విడుదల చేసిందన్నారు. అక్టోబర్ 24వ తేదీ వరకు ఈ అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీకేఎం యూడీఏ ప్రణాళిక విభాగం అధికారి సంధ్య, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కేఆర్ మధు, ఏడీఎం బి. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

లారీలు ఢీకొని ఇద్దరు డ్రైవర్లకు గాయాలు

మదనపల్లె రూరల్ : రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. కుప్పం వడ్డిపల్లెకు చెందిన డ్రైవర్ నారాయణస్వామి(30) టెంపోలో మదనపల్లె టమాటా మార్కెట్‌కు బయలుదేరాడు. హైదరాబాదుకు చెందిన వెంకటదుర్గారావు(45) లారీలో పలమనేరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని 150వ మైలు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీల్లోని ఇద్దరు డ్రైవర్లు గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

గర్భిణి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : గర్భిణి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన బుధవారం పీటీయం మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. పీటీఎం మండలం టి.సదుంకు చెందిన శ్రీకాంత్ భార్య పావని(27) ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. కాగా భర్త కొంతకాలంగా తనను, బిడ్డను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు.

భర్త మద్యం మానలేదని బలవన్మరణం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన రత్నమ్మ


రత్నమ్మ కుమారుడు ముని పుష్కర్ నందన్

నిమ్మనపల్లె : కులాలు వేరైనా పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకుంది.. ఎన్నో ఆశలతో కొత్త జీవితాన్ని ప్రారంభించిన కొంత కాలానికి భర్త మద్యానికి బానిస కావడంతో, ఎలాగైనా మాన్పించాలనుకుంది.. అందుకోసం ఎన్నో సార్లు భర్తతో గొడవ పడింది.. భర్త అలవాటును మార్చలేక.. తన వాళ్ల ముందు తలెత్తుకోలేక.. తీవ్ర మనస్తాపానికి గురై ఆ అభాగ్యురాలు తనువు చాలించింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. పెద్దతిప్పసముద్రం మండలం టి.సదుం పంచాయతీ రామాపురం గ్రామానికి చెందిన మలిశెట్టిపల్లె వెంకటరమణ, వెంకటరమణమ్మ దంపతుల కుమార్తె ఎం.రత్నమ్మ ఎం.ఫార్మసీ వరకు చదివి, మదనపల్లె ఎన్టీఆర్ సర్కిల్‌లోని అపోలో మెడికల్ షాప్‌లో పనిచేస్తూ ఉండేది. నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన బల్లాపురం చంద్రశేఖర్ కుమారుడు జ్యోతి శేఖర్ తల్లిదండ్రులు మరణించడంతో అమ్మమ్మ ముని సుబ్బమ్మతో ఉంటూ డిగ్రీ వరకు చదువుకొని మదనపల్లె అపోలో ఫార్మసీలో చేరాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో కొన్నాళ్ల తర్వాత 2019 సంవత్సరంలో పెద్దలను కాదని ఇరువురు తవళం నేలమల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ముని పుష్కర్ నందన్ అనే ఒకటిన్నర ఏడాది బాబు ఉన్నాడు. వివాహం అనంతరం ఇరువురు ఉద్యోగాలు మానేసి, ఇంటివద్దే ఉంటూ జ్యోతి శేఖర్ పెయింటింగ్ పనులకు వెళ్తుండగా , రత్నమ్మ స్థానికంగా పనులకు వెళ్లేది. కొంతకాలంగా జ్యోతి శేఖర్ విపరీతంగా మద్యానికి బానిస అయ్యాడు. మద్యం సేవించి ఇంటికి వచ్చిన సమయంలో భార్యతో అతిగా గొడవపడేవాడు. ఈ క్రమంలో తరచు భార్యాభర్తల మధ్య మద్యం అలవాటు విషయమై విభేదాలు తలెత్తి గొడవ పడేవారు. మూడు నెలలుగా రత్నమ్మ భర్తను నీవు మద్యం అలవాటు మానకపోతే నేను చచ్చిపోతాను అంటూ బెదిరించేది. ఈ నేపథ్యంలో మంగళవారం భర్త మద్యం సేవించి ఇంటికి రాగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. అనంతరం జ్యోతి శేఖర్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి, రత్నమ్మ ఇంటికి గడియ పెట్టి ఉండడంతో, జ్యోతి శేఖర్ కిటికీలో నుంచి లోనికి చూడగా భార్య ఉరి వేసుకొని వేలాడుతూ ఉండటం గమనించాడు. వెంటనే తలుపులు బద్దలు కొట్టి స్థానికుల సాయంతో భార్యను కిందికి దించి, వెంటనే స్థానిక పీహెచ్‌సీ కేంద్రానికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్య సిబ్బంది రత్నమ్మ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. ఈ విషయం స్థానికులు పోలీసులకు తెలియజేయడంతో, వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం ఉదయం తహసీల్దార్ తపస్విని స్థానికుల సమక్షంలో శవ పంచనామా నిర్వహించి వాంగ్మూలం రికార్డ్ చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పెన్నానదిలో యువకుడి గల్లంతు


నాయుని విక్రమ్ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రామేశ్వరం సమీపంలోని రెండు కుళాయిల వద్ద ఉన్న పెన్నానదిలో నాయుని విక్రమ్ (20) అనే యువకుడు గల్లంతయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. మిట్టమడివీధికి చెందిన నాయుని విక్రమ్ వన్‌టౌన్ సర్కిల్‌లోని టీ దుకాణంలో మాస్టర్‌గా పని చేస్తున్నాడు. అతను తన స్నేహితులు వెంకటసాయి, ముత్తయ్య, శివలింగమయ్యలతో కలిసి బుధవారం పెన్నానదికి వెళ్లాడు. మిత్రులందరూ పెన్నానదిలో కొంత సేపు సరదాగా గడిపారు. కొంత సేపటి తర్వాత మళ్లీ వస్తానని చెప్పి విక్రమ్ వారికి దూరంగా వెళ్లాడు. అలా వెళ్లిన అతను నీటిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బోటు సాయంతో నదిలో గాలించారు. నీరు ఎక్కువగా ప్రవహిస్తుండటంతో విక్రమ్ ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యులు రోదించసాగారు. యువకుడి తల్లి రుక్మిణీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

అవయవ దానం చేసి.. ప్రాణదాతగా నిలిచి..


శివరామసుబ్బయ్య (ఫైల్)

మైలవరం : అవయవ దానం గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు 13న ప్రపంచ అవయవ దాన దినోత్సవం నిర్వహిస్తారు. సరిగ్గా ఇదే రోజున వైద్యులు కల్పించిన అవగాహనతో మరణించిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులు అవయవ దానం చేసి స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచారు. వివరాలు ఇలా..

ఈనెల 10వ తేదీన మైలవరం రిజర్వాయర్ గేట్ల వద్ద ప్రమాదవశాత్తు గోడ మీద పడిన దుర్ఘటనలో శివరామసుబ్బయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. అవయవ దాన దినోత్సవం సందర్భంగా వైద్యులు ఇచ్చిన స్ఫూర్తితో మృతుని కుటుంబ సభ్యులు కిడ్నీ, లివర్, ఊపిరితిత్తులను ఆసుపత్రిలోనే దానం చేశారు. తాను మరణించినా మరొకరి జీవితానికి వెలుగును ప్రసాదించి చిరంజీవిగా నిలిచిపోయాడని అవయవ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

వరకట్న మరణం కేసులో పదేళ్ల జైలు శిక్ష

నందలూరు : వరకట్న మరణం కేసులో ముద్దాయి పామూరు సాయివర్ధన్‌కు రాజంపేట 3వ ఏడీజే కోర్టు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నందలూరు టౌన్ బ్రాహ్మణవీధికి చెందిన పామూరి సాయివర్ధన్ తన భార్య పామూరి లక్ష్మీప్రసన్న(22)ను అదనపు కట్నం కోసం వేధించేవాడు. దీంతో ఆమె భర్త వేధింపులు తాళలేక 2023వ సంవత్సరం మార్చి 29వ తేదీన తన చున్నీతో ఉరి వేసుకొని చనిపోయినట్లు, మృతురాలి తండ్రి రావూరు కనకరత్న ఆచారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో కోర్టు ఈమేరకు శిక్ష విధించింది.

మృతదేహాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

సాక్షిటాస్క్‌ఫోర్స్: మండల పరిధిలోని కె.సుగుమంచిపల్లె పునరావాస కేంద్రంలోని బుక్కపట్నం గ్రామానికి చెందిన ఆర్.చిన్న బాలయ్య మంగళవారం కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కొందరు గ్రామస్తులు ఓ స్థలం విషయమై వేధింపులకు గురి చేయడంతో కడప కోర్టు ఆవరణంలో గత నెల 29న పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కర్నూలు ఆసుపత్రిలో మృతి చెందడంతో బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సొంత గ్రామంలోకి తీసుకొని వస్తుండగా మండలంలోని కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద దత్తాపురం గ్రామ ప్రజలు, పోలీసులు సుమారు రెండు గంటల పాటు రానీయకుండా అడ్డుపడ్డారు. దీంతో విధిలేని పరిస్థితిలో మృతుని బంధువులు తాడిపత్రి మీదుగా జమ్మలమడుగు సమీపంలోని గూడెంచెరువు వద్దకు మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.